క్లుప్తంగా

ఉచిత ఆన్‌లైన్ శిక్షణ



విద్యారణ్యపురి: సెట్విన్, తెలంగాణ భవన నిర్మాణ కార్మికశాఖ సంయుక్తంగా కార్యాచరణ రూపొందించి 26 కోర్సుల్లో యాప్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ శిక్షణను అందిస్తోందని కాజీపేట ఏఎల్‌ఓ బి.చాణక్య తెలిపారు. ఈమేరకు యువత స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ మార్గ దర్శకత్వంలో కార్మికుల పిల్లలకు ఉచిత కెరీర్ గైడెన్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్ వర్క్‌షాప్‌ను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ అర్బన్ ఏరియా ఏఎల్‌ఓ శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



న్యూశాయంపేట: గ్రూప్ –4 ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీ నిరుద్యోగులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇస్లామియా ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వరంగల్ ఇస్లామియా కళాశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా దృక్పథంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పేద నిరుద్యోగులు 60 రోజుల పాటు నిర్వహించే తరగతులను ఉపయోగించుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెక్రటరీ అఫ్జల్ మొహియొద్దీన్, నజీమొద్దీన్, రహీం, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆస్పత్రికి తరలింపు



మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ఎండలో పడిఉన్న మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళను కానిస్టేబుల్ చేరదీశారు. ఈమేరకు ఆమెకు నీళ్లు తాగించి ఆస్పత్రిలో చేర్పించి మానవత్వం చాటారు. మామునూరు స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌కు వెళ్లిన కానిస్టేబుల్ శ్రీనివాస్.. రోడ్డుపై అచేతన స్థితిలో పడిఉన్న మహిళను గమనించాడు. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఆదేశాలతో పోలీస్ వాహనంలోనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ధ్యాన కేంద్రంలో ఒక్కటైన జంట



కాజీపేట అర్బన్: ధ్యాన కేంద్రమే కల్యాణ మండపంలా మారిపోయింది. హనుమకొండ హంటర్‌రోడ్డులోని పిరమిడ్స్ ధ్యాన కేంద్రంలో మొదటిసారిగా ఓ ప్రేమ జంటకు పెద్దల సమక్షంలో శుక్రవారం వివాహం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్, నర్మద ఒక్కటయ్యారు.

పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



హన్మకొండ: పాడి పశువుల పెంపకంలో రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని హనుమకొండ జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ సూచించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పశువైద్య శాఖలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని వెంకటనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులకు సరైన దాణా అందించాలని చెప్పారు. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ మేరకు రైతులకు ఖనిజ లవణ మిశ్రమం కిట్, క్యాల్షియం అందించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక, పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్, స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది రాకేష్, యాదలక్ష్మి, కొమురయ్య, వంశీ పాల్గొన్నారు.

దేవాలయానికి వాటర్ ట్యాంక్ బహూకరణ

రామన్నపేట: వరంగల్ నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలోని మల్లికార్జునస్వామి ఆలయానికి రూ.10 వేల విలువగల వాటర్ ట్యాంక్‌ను డివిజన్ వాసి నాగరాజు బహూకరించారు. ఈమేరకు మేయర్ సుధారాణి చేతుల మీదుగా ఆలయానికి అందించారు.



భద్రకాళి దేవాలయంలో అమ్మవారి సన్నిధిలో పూజ చేస్తున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



23వ డివిజన్‌లో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, తదితరులు



హసన్‌పర్తి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్, బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను నగరవ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆస్పత్రుల్లో రక్తదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



చీరలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ రిజ్వాన



కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయం ఎదుట..



కేయూ మొదటి గేట్ వద్ద బీఆర్ఎస్‌వీ నాయకులు



5వ డివిజన్‌లో కేక్ కట్‌చేస్తున్న విద్యాసాగర్



తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ జబ్బార్ ఆధ్వర్యంలో..



మెట్టుగుట్టపై పూజ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో..



ఎంజీఎంలో రక్తదానం చేస్తున్న నాయకులు

గుడిసెవాసులకు పట్టాలివ్వాలని వినతి

హన్మకొండ: గుడిసెవాసులకు జీఓ నంబర్ 58 ప్రకారం పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను సీపీఎం జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి మాట్లాడుతూ ఇంటి అద్దె చెల్లించలేక జిల్లాలో 12 ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో దాదాపు 8,500 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, గొడుగు వెంకట్, మంద సంపత్, కాడబోయిన లింగయ్య పాల్గొన్నారు.



చీఫ్‌విప్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రెస్ క్లబ్ కమిటీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టింది. ప్రెస్ క్లబ్‌లో ఉదయం ముందుగా వేదపండితుల ఆధ్వర్యంలో పూజ, ఆశీర్వచన కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఆధ్వర్యంలో ఈసీ మీటింగ్ జరిగింది. కార్యదర్శి ప్రవేశపెట్టిన పలు తీర్మానాలకు సభ్యులంతా ఆమోదం తెలిపారు. వరంగల్‌లో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు, కాజీపేట, హసన్‌పర్తి మీడియా పాయింట్ల నిర్వహణకు నెలకు రూ.10వేలు చెల్లించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ప్రెస్ క్లబ్ నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించారు. వైస్ ప్రెసిడెంట్లు, జేసీలు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ కార్యక్రమాల్లో పాల్గొనండి

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో అగ్రగామిగా నిలుస్తూ సేవలు అందిస్తున్న హనుమకొండ రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సందర్శించాలని, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను రెడ్‌క్రాస్ పాలకవర్గం కోరింది. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ప్రతినిధులు శుక్రవారం కలిసి సన్మానించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు, పెద్ది వెంకటనారాయణ, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కలెక్టర్‌ను కలిసిన పింగిళి కళాశాల సిబ్బంది

హన్మకొండ: హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్, లెఫ్టినెంట్ బత్తిని చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ పార్వతి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందనలు

హసన్‌పర్తి: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన భీమారం నేషనల్ జిమ్‌కు చెందిన చిట్యాల ప్రత్యూషను కలెక్టర్ పట్నాయక్ అభినందించారు. ఈనెల 22నుంచి జమ్ముకశ్మీర్‌లో జరగనున్న పోటీల్లో ప్రత్యూష పాల్గొననుంది.

సంక్షిప్తంగా

26న పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికలు

హన్మకొండ అర్బన్: తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా శాఖకు ఈనెల 26న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి కూచన వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను ఈనెల 20న ప్రకటిస్తామని, 22న నామినేషన్ల స్వీకరణ, 23న అభ్యర్థుల జాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. ఏకగ్రీవం కాకుంటే 26న పోలింగ్, ఫలితాల వెల్లడి ఉంటుందని పేర్కొన్నారు. అధ్యక్ష, కార్యదర్శి స్థానాలతోపాటు సంయుక్త కార్యదర్శి, కార్యనిర్వాహక కార్యదర్శి, ప్రచార కార్యదర్శి, సాంస్కృతిక కార్యదర్శి, కోశాధికారి, నలుగురు ఈసీ మెంబర్లతోపాటు మొత్తం 12మంది కార్యవర్గం ఏర్పాటుకు ఎన్నికల నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సెయింట్ మాథ్యూస్ వార్షికోత్సవం

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని సెయింట్ మాథ్యూస్ పాఠశాల 27వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, పాఠశాల ఫౌండర్ మేరీ జాయ్, ప్రిన్సిపాల్ చరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వస్కుల కృష్ణకు బెస్ట్ లీడర్‌షిప్ అవార్డు

హన్మకొండ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి వస్కుల కృష్ణకు బెస్ట్ లీడర్‌షిప్ అవార్డును ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.ప్రభాకర్‌రావు అందించారు. ఈనెల 16న హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ ఆవిర్భావ సభలో అవార్డులను ప్రకటించారు. ఈమేరకు కృష్ణను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్, ఎన్పీడీసీఎల్ శాఖ ఉపాధ్యక్షుడు రమేష్‌కుమార్, కార్యదర్శి దానయ్య అభినందించారు.

డాక్టర్, ఫార్మసిస్టు పోస్టులకు నోటిఫికేషన్

గీసుకొండ: వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆర్‌బీఎస్‌కే స్కీంలో ఉన్న 2మెడికల్ ఆఫీసర్, 2ఫార్మసిస్టు పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టులకు మల్టీజోన్–1కు సంబంధించి బీసీ–ఈ, ఓసీ ఉమెన్ కేటగిరీ అభ్యర్థుల నుంచి, ఫార్మసిస్టు పోస్టులకు జోన్–4 (భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల) నుంచి ఓసీ ఉమెన్, ఎస్సీ ఉమెన్ కేటగిరీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి



హన్మకొండ: తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివిస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని వరంగల్ డీఈఓ వాసంతి అన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కార అవార్డుల కార్యక్రమం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం జరిగింది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులై 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా పురస్కార అవార్డులను ఆ సంస్థ అందించింది. ప్రతి జిల్లా నుంచి వంద మంది విద్యార్థినులను ఎంపిక చేసి పురస్కారాలు అందించారు. వరంగల్ డీఈఓ వాసంతి, ఆ జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ బాలిక విద్యను ప్రోత్సహించడం మంచి పరిణామమన్నారు. కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3,500 అందించామన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలి

హన్మకొండ: జిల్లా కోర్టులో తొమ్మిదేళ్లుగా పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు డిమాండ్ చేశారు. జిల్లా కోర్టులో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులు హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు రాజు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టులో పని చేస్తున్న కార్మికులను కాంట్రాక్టర్ అకారణంగా తొలగించడం అన్యాయమని వాపోయారు. కార్యక్రమంలో బొల్లంపల్లి సారయ్య, అడ్లూరి పద్మ, కొల్లూరి రజిత, ఒంటేరు చక్రి, కన్నం సునీల్, వేల్పుల శంకర్, నాగరాజు, చాతల్ల వేణుగోపాల్, కందుకూరి కిషోర్, దరిగి ధన్‌రాజు, నాగరాజు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఆధ్యాత్మిక సమ్మేళనంలో పాల్గొనండి



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్: ఓరుగల్లు విశిష్టతను చాటే విధంగా అంగరంగ వైభవంగా శనివారం జరగనున్న మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో నగర ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హయగ్రీవాచారి మైదానంలో నిర్వహించనున్న సాంస్కృతిక సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, విశిష్ట అతిథిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పాల్గొంటారని రాకేష్‌రెడ్డి తెలిపారు. మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ సాయంత్రం ప్రారంభమయ్యే సమ్మేళనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, శ్రీరామ్ ఉదయ్, నరహరి వేణుగోపాల్‌రెడ్డి, రావుల కిషన్, శ్రవణ్ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

కేయూ క్యాంపస్: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయభాస్కర్ అన్నారు. సీఎం జన్మదినాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్వీ), కాకతీయ క్రికెట్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, కాకతీయ క్రికెట్ అకాడమీ చైర్మన్ ఫారూక్, బీఆర్‌ఎస్వీ నాయకులు పరశురాములు, రాంబాబు, వీరేందర్, రాజేష్, అభిషేక్, వినోద్, ప్రవీణ్, తిరుపతి, స్నేహిత్, వీరు, అస్లాం, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. కాగా, ఈ పోటీలు ఈనెల 25వ తేదీ వరకు నాకవుట్ పద్ధతిలో కొనసాగుతాయి.



టాస్ వేస్తున్న దాస్యం విజయభాస్కర్

డాక్టరేట్ ప్రదానం



వంగాల సుధాకర్



సంపత్‌కుమార్



సుమలత

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో పార్ట్ టైం అధ్యాపకులుగా పనిచేస్తున్న వంగాల సుధాకర్, అనబోయిన సంపత్‌కుమార్‌కు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పబ్లిక్ రిలేషన్స్ ప్రాక్టీసెస్ ఇన్ సెంట్రల్ స్టేట్ అండ్ ప్రైవేట్ యూనివర్సిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వంగాల సుధాకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కటకం రాజారాం పర్యవేక్షణలో సుధాకర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. వంగాల సుధాకర్ కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఇప్పటికే డాక్టరేట్ అందుకున్నారు. దీంతో ఆయన డబుల్ డాక్టరేట్ పొందారు. కాగా, రోల్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఇన్ ద ప్రమోషన్ ఆఫ్ సోషల్ అవేర్‌నెస్ ఏ స్టడీ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్ ఇన్ తెలంగాణ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సంపత్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. తెలంగాణ యూనివర్సిటీ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆయన తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, కేయూలోని హిస్టరీ విభాగం పరిశోధకురాలు సుమలత బండికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ అండర్ ది కాకతీయాస్ 1000 ఏ.డి టూ 1323 ఏ.డి అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సుమలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ సదానందం పర్యవేక్షణలో సుమలత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



కాజీపేట: ఉత్సవాలను ప్రారంభిస్తున్న రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామి



బన్నులో శివరాత్రి వేడుకల్లో అతిథులు, విద్యార్థులు



ఖిలా వరంగల్: శంభులింగేశ్వర ఆలయ ప్రాంగణంలో వేసిన చలువ పందిళ్లు

కాజీపేట: మహాశివరాత్రి ఉత్సవాలకు నగరవ్యాప్తంగా పలు ఆలయాలు సర్వం సిద్ధమయ్యాయి. కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవ వేడుకలను రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి శుక్రవారం ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి, పీర్వో మణిదీప్, సుధీర్, గంగుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: మహాశివరాత్రి ఉత్సవాలకు హసన్‌పర్తి మండలం సిద్ధాపురంలోని కత్తెరశాల మల్లికార్జునస్వామి దేవాలయం ముస్తాబైంది. శనివారం ఉదయం 8గంటలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం 6గంటలకు జాతర ఉత్సవాలు ప్రారంభం, సాయంత్రం 7గంటలకు ఒగ్గు పూజారుల పట్నాలు, అర్ధరాత్రి 12గంటలకు లింగోద్భావ కాలంలో స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'బన్ను'లో మహా శివరాత్రి ఉత్సవాలు

హన్మకొండ అర్బన్: దివ్యాంగ పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, పర్వదినాలపై అవగాహన కల్పించేందుకు దర్గా బందం చెరువు సమీపంలోని బన్ను న్యూరో హెల్త్ కేర్ సెంటర్‌లో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ ప్రతినిధి ఈవీ.శ్రీనివాస్‌రావు అన్నారు. కార్యక్రమంలో పెద్ది వెంకట నారాయణగౌడ్, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, డైరెక్టర్ చరణ్‌జిత్ రెడ్డి పాల్గొన్నారు.

పలు డివిజన్లలో..

కాశిబుగ్గ: 18, 19, 20 డివిజన్లలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర రంగనాథస్వామి ఆలయంలో అంతా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉదయం 4గంటల నుంచి రుద్రాభిషేకం, అర్చనలు, భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భావ కాలంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఖిలా వరంగల్ కోటలో..

ఖిలా వరంగల్: చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన కాకతీయుల రాజధాని మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు, విద్యుత్ లైటింగ్, తాగునీటి సౌకర్యాల ఏర్పాట్లతోపాటు క్యూలైన్లకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వరంగల్ శివనగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రాజయోగిని బ్రహ్మకుమారి సవిత ఆధ్వర్యంలో శనివారం వేడుకలు జరగనున్నాయి.

హరిహరపుత్ర ఆలయంలో..

కాజీపేట: హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. దాతలు ఇటీవల అందించిన బంగారు తాపడం, వెండి మకర తోరణాన్ని స్వామి వారి పీఠానికి అలంకరించారు. గణపతి హోమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు ఉడుతల శ్రీనివాస్ శర్మ జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుర్ర జనార్దన్ గౌడ్, పాక శ్రీనివాస్, అరూరి సాంబయ్య, కుమారస్వామి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

కడిపికొండ పురవీధుల్లో..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఉత్సవాలను ఆలయ పూజారి జాగర్లపూడి శ్రీనివాసశర్మ శుక్రవారం ప్రారంభించారు. గణపతి పూజ, రుద్రాభిషేకం నిర్వహించి, ధ్వజ స్తంభానికి కుంభాభిషేకం, జెండా ఆవిష్కరణ చేపట్టారు. శివపార్వతుల ఉత్సవమూర్తుల విగ్రహాలను సాయంత్రం ఊరేగించారు.

మహిళలకు అండగా 'సఖి సెంటర్'



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

కాజీపేట: బాధిత మహిళలతో పాటు బాలికలకు సఖి సెంటర్ అండగా ఉంటుందని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల తెలిపారు. ఈమేరకు సఖి కేంద్ర సేవలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ కాలనీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సఖి కేంద్రం సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు ఆపదలో ఉన్నప్పుడు 181 హెల్ప్‌లైన్‌కు లేదా 0870 – 2452112 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.